

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 267 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం, 28, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

# అవినీతి దోపిడీకి హద్దులెక్కడ..?






నిధుల దోపిడీ నేరం

రహస్యంగా దోచుకోవడం అత్యంత నేరం

అధికారిక హోదాకు అవినీతి సంపాదనకు లెక్కలు లేవు

అయోధ్య రామాలయం దొంగతనాన్ని అత్యద్భుతంగా వల్లిస్తున్నారు

దేశానికి పట్టిన దరిద్రాన్ని దేవునితో సమానం అంటున్నారు

దొంగతనం చేసినావాడు అవినీతికి పాల్పడ్డోడు ఎప్పటికీ తప్పించుకోడు

ప్రజా నిధులను దుర్వినియోగపరచడం అవినీతితో కూడిన మోసం

అవినీతి చేస్తూ దేశంలో విపత్తు కాలాలను సృష్టించి విర్రవీగుతున్నారు

అధికారికంగా ప్రభుత్వ సొమ్మును తర్జుమా చేసుకుంటున్నారు

దేశంలో కఠినమైన ఆంక్షలు అన్నీ పేదవాళ్ళకే సంపన్నులకు వర్తించవు

అవినీతి చేయడమే దేశ పాలన అనుకుంటున్న మహానుభావులు లేకపోలేదు : డాక్టర్ బరిగెల శివ

**దేశంలో అవినీతి, ప్రజా నిధుల దుర్వినియోగం, రాజకీయ ఆర్థిక లావాదేవీలకు హద్దులు లేకుండా పోతున్నాయని డా. బరిగెల శివ ఆరోపించారు. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్న సొమ్ము ప్రజా సంక్షేమానికి పూర్తిస్థాయిలో వినియోగం కాకుండా దుబారా ఖర్చులు, రాజకీయ ప్రచారాలు, వివిధ ప్రాజెక్టులు, టెండర్ల పేరుతో భారీగా ఖర్చవుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచడం, ప్రభుత్వ సంస్థలను** ప్రైవేటీకరించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థపై మరింత భారం మోపుతున్నారని మండిపడ్డారు. ఒకవైపు పేదలు కనీస అవసరాల కోసం ఇబ్బందులు పడుతుంటే మరోవైపు సంపన్నులు, రాజకీయ నాయకులు భారీగా ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని ఆరోపించారు. రాజకీయ పార్టీలకు అందుతున్న నిధులు, ఎన్నికల ఖర్చులు, ప్రకటనల వ్యయాలు, ఇతర ఆర్థిక లావాదేవీలపై పూర్తి పారదర్శకత ఉండాలని డిమాండ్ చేశారు. ఆలయాలు, ప్రభుత్వ సంస్థలు, ప్రజా సంక్షేమ పథకాలకు సంబంధించిన నిధుల వినియోగంపైనా ప్రజలకు స్పష్టమైన లెక్కలు అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రజా నిధులను దుర్వినియోగం చేసే వారితో పాటు అవినీతికి సహకరిస్తున్న అధికారులను కూడా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలోని రాజకీయ, ఆర్థిక వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఒక న్యాయం, సంపన్నులకు మరో న్యాయం అనే పరిస్థితి కొనసాగితే ఆర్థిక అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అవినీతిని అరికట్టేందుకు పారదర్శక పాలన, ప్రజా నిధులపై కఠిన ఆడిట్, జవాబుదారీతనం తప్పనిసరి చేయాలని డా. బరిగెల శివ స్పష్టం చేశారు. - హైదరాబాద్, (జై భీమ్ డెస్క్)






డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్




## భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించడం కుదరదు

పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య బానిస కాదు

పెళ్లంటే పరస్పర గౌరవంతో బతికే బంధం

పనిమనిషిగా చూడాలనుకునే తీరు క్షమార్హం కాదు

కర్ణాటక హైకోర్టు సంచలన వ్యాఖ్యలు



7

## హన్మకొండలో బిఆర్ఎస్ ధర్నా

హరీష్ రావు అరెస్టుతో పోలీస్ స్టేషన్ ముందు బైఠాయింపు



5

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పీఆర్సీ ప్రకటించాలి.. ఆరు డీఏలు విడుదల చేయాలి

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలి

సమస్యల పరిష్కారానికి త్వరలో శుభవార్త: నాయిని

అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: హరీశ్‌రావు




4

## మీరాలం చెరువుకు మహర్దశ

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం

పనులను పరిశీలించిన సిఎం రేవంత్



5

# అవినీతి దోపిడీకి హద్దులెక్కడ

**నిధుల దోపిడీ నేరం**
**రహస్యంగా దోచుకోవడం అత్యంత నేరం**
**అధికారిక హోదాకు అవినీతి సంపాదనకు లెక్కలు లేవు**
**అయోధ్య రామాలయం దొంగతనాన్ని అత్యద్భుతంగా వల్లిస్తున్నారు**
**దేశానికి పట్టిన దరిద్రాన్ని దేవునితో సమానం అంటున్నారు**
**దొంగతనం చేసినావాడు అవినీతికి పాల్పడ్డోడు ఎప్పటికీ తప్పించుకోడు**
**ప్రజా నిధులను దుర్వినియోగపరచడం అవినీతితో కూడిన మోసం**
**అవినీతి చేస్తూ దేశంలో విపత్తు కాలాలను సృష్టించి విర్రవీగుతున్నారు**
**అధికారికంగా ప్రభుత్వ సొమ్మును తర్జుమా చేసుకుంటున్నారు**
**దేశంలో కఠినమైన ఆంక్షలు అన్నీ పేదవాళ్ళకే సంపన్నులకు వర్తించవు**
**అవినీతి చేయడమే దేశ పాలన అనుకుంటున్న మహానుభావులు లేకపోలేదు**
**డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-**

వికసిత్ భారత్ అంటూ ప్రచారాలు చేస్తున్న మేధావులంతా అవినీతి సామ్రాజ్యంలో ఆరితేరిన వాళ్లేనని డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు.దేశం పట్ల గౌరవం ఉన్నట్లు నటిస్తూ దేశ సంపదను విచ్చలవిడిగా దోచుకుంటున్నారని మండిపడ్డారు.దేశం ఆర్థికంగా వెనుకబడడానికి ప్రధాన కారణాలలో దేశ పాలనలో దుబారా ఖర్చులు విపరీతంగా పెడుతున్నారని మండిపడ్డారు.వందలాది ప్రభుత్వ పరిశ్రమలను మూసివేస్తునడమే కాకుండా ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ దేశాన్ని ఆర్థికంగా అప్పుల్లోనికి నెట్టివేస్తున్నారని నిలదీశారు.పీఎం రిలీఫ్ ఫండ్ ప్రైవేట్ అకౌంట్ లోకి ఇంచుమించు పదివేల కోట్ల రూపాయలు జమ చేయబడడం వాటిని పేద ప్రజల సహాయార్థం ఖర్చు పెట్టాల్సింది పోయి డిపాజిట్ చేసుకోవడం వింతగా ఉందన్నారు.డిపాజిట్ ద్వారా వస్తున్నటువంటి సుమారు 400 కోట్ల ఆదాయం ఎక్కడ ఖర్చు చేస్తున్నట్లుగా ఆనవాళ్లు లేవన్నారు.పైగా సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరుతుండగా ప్రభుత్వ నిధులలో కెళ్ళి జమ చేసినటువంటి సొమ్ము కాదని ప్రైవేట్ పరంగా సమీకరించుకున్న నిధులంటూ దాటవేయడం ఎంతటి మోసమో దేశ ప్రజలు గమనించాలన్నారు.ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు వేల సంఖ్యలో మూసి వేయబడుతున్నాయని విద్యను నాశనం చేయడం కోసమే దేశ పాలన ఉరకలేస్తుందన్నారు.ప్రైవేట్ సంస్థల ద్వారా దోచుకుంటే ఎవరికి లెక్కలు చెప్పాల్సిన అవసరం లేదనే భ్రమలో దేశ పాలన మొత్తం పరిశ్రమల దోపిడి చుట్టే తిరుగుతుందని గుర్తు చేశారు.ప్రతి రాష్ట్రంలోని ప్రభుత్వ ఖజానాల్లోని సొమ్ము నేరుగా ఖర్చుల రూపంలో గానీ




కార్యక్రమాల రూపంలో గానీ అభివృద్ధి రూపంలో గానీ టెండర్ల రూపంలో గానీ వేలకోట్ల రూపాయలు తర్జుమా చేయబడుతున్నాయని వాటన్నిటికీ లేక్కా పత్రాలు లేకుండా పోవడం ప్రభుత్వ సొమ్మును విపరీతంగా ఖర్చులు పెడుతూ ఆర్థిక లావాదేవీలను పెంపొందించుకుంటున్నారని మండిపడ్డారు.ఒకవైపు పేదవాడు రేషన్ బియ్యానికి పరిమితం అవుతుంటే సంపన్నులు వేలకోట్ల రూపాయల సంపాదిస్తూ దేశ సొమ్మును ఆర్జిస్తున్నారన్నారు.అక్రమంగా సంపాదించుకోవడం కోసం రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుంటూ పూర్తిగా దిగజారిపోతున్నారని లక్షలాది కోట్ల రూపాయల వ్యాపారాలు చేయడం దేశవ్యాపారుల గొప్పతనముల భావించుకుంటున్నారన్నారు. ఇతర దేశాల నుండి నిధుల సేకరణ అనేది కేవలం అధికార పార్టీకి మాత్రమే చెందే విధంగా ఇప్పటికే 12 సంవత్సరాలుగా ఇతర దేశాల నుండి సమీకరించుకున్న సొమ్మంత పోగు చేసుకున్నారని అంతే కాకుండా ఇతర దేశాలలో వ్యాపారాలు చేయడానికి వేలకోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టుకొని వ్యాపారాలు చేస్తున్నారని 12 సంవత్సరాలలో దేశ రాజకీయాల్లో ఉపయోగించిన ఆర్థిక లావాదేవీలను కేంద్ర ప్రభుత్వం శ్వేత పత్రం రూపంలో విడుదల చేయాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు.ప్రజల సొమ్మును ప్రజలకు ఖర్చు చేయడానికి తెగ బాధపడుతున్న ప్రభుత్వాలు నాయకుల ఆస్తులను ఎప్పటికప్పుడు అభివృద్ధి పరచుకోవడం కోసం మాత్రం కరుకైన రాజకీయాలను చేస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు.దేశంలో సగటు ఆర్థిక భారం పేద ప్రజలు మోస్తుండగా ఆస్తుల లబ్ధి మాత్రం సంపన్నులకు ప్రజాప్రతినిధులకు రాజకీయ నాయకులకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు మంత్రులకు కేంద్ర మంత్రులకు చెందే విధంగా రాజకీయ అభివృద్ధిని కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు.

**సంపన్నులే సంపాదకులు..**

అవినీతి సొమ్మును సంపాదించుకోవడానికి రాజకీయ పరమైన దోపిడీ ఒకవైపు సాగుతుండగా అధికార దోపిడీ మరోవైపు సాగుతుందని అంతటితో ఆగకుండా ఆలయ దోపిడీలకు పాల్పడే స్థాయికి దేశ అవినీతి పెరిగిపోవడం చరిత్ర లాంటిదన్నారు.దేశంలోని ప్రధాన రాజకీయ నేతలందరూ రోజువారి కార్యక్రమాల ఖర్చుల కోసమే కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారని రాజకీయపరమైన ప్రచారాల కోసం వేలకోట్ల రూపాయలను దుబారగా ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు.ప్రచారం మాధ్యమాలకు ప్రధాన మీడియాలకు కోట్ల రూపాయల యాడ్స్ను కట్టబెడుతున్నారని వాళ్లంతా అవినీతిపరులైన రాజకీయ నాయకులను భజన చేయడానికి భక్తిపరులవుతున్నారని మండిపడ్డారు.రాజకీయంగా అధిక సొమ్మును సంపాదించుకున్న సంపన్నులంతా మీడియాలను శాసిస్తున్నారని పైగా వాళ్లే ఆర్థికపరమైన లావాదేవీలను ప్రభుత్వాల ద్వారా లాంచనంగా పొందుకుంటూ మీడియా రూపంలో కూడా ప్రత్యేకమైన ఆర్థిక సంపదను ఆర్జిస్తున్నారన్నారు.సంపన్నుల దగ్గర వేలకోట్ల రూపాయలు లక్షల కోట్ల రూపాయలు మూలుగుతూ ఉంటుండగా అధికార పదవులు పూర్తయ్య వరకు కనీసం లక్ష కోట్ల రూపాయలను రెండు లక్షల కోట్ల రూపాయలను మూడు లక్షల కోట్ల రూపాయలను ఇలా ప్రస్తావిస్తూ లక్షల కోట్ల రూపాయలను సంపాదించుకోకపోతే జీవితం ధన్యం కాదనే విధంగా అవినీతి సమాజాన్ని సృష్టించుకుంటున్నారని మండిపడ్డారు.రాజకీయ శక్తులుగా ఎదిగిన సందర్భాలను ప్రస్తావించాల్సి వచ్చినప్పుడు ప్రతి రాజకీయ నాయకుడు కిందిస్థాయి నాయకులను తొక్కేసుకుంటూనే ఆర్థిక వ్యాపారాలు చేసుకుంటున్నారని ప్రభుత్వాలలో అధికారంలో ఉన్నంతకాలం ఆర్థికపరమైన అక్రమ వ్యాపారాలకు హద్దులు లేకుండా పోతుందని గుర్తు చేశారు.దేశ ప్రజల మనోభావాలతో ఏమాత్రం సంబంధం లేకుండా హద్దులు లేకుండా ఆస్తులు సంపాదించుకోవడమే ప్రామాణికంగా పెట్టుకొని ప్రజల ప్రాణాలు పోతున్న పట్టించుకోకుండా దోపుడు సొమ్మును దొడ్డి దారిన సంపాదిస్తున్నారని మండిపడ్డారు.సంపాదన ఎక్కువైపోయాక సంపాదించుకున్న డబ్బులను ఏం చేయాలో తెలియక దుబారా ఖర్చులకు వాడుతున్నారని మండిపడ్డారు.ఇతర పార్టీలు ఇతర దేశాలపై నిధులను సమీకరించుకోకుండా బిజెపి ప్రభుత్వం మాత్రమే పూర్తిస్థాయిలో అభివృద్ధి చెంది ఇతర పార్టీలపై ఆంక్షలు విధించడం కోసం పార్లమెంటులో నూతన చట్టాన్ని తీసుకొచ్చారన్నారు.ప్రతి రాష్ట్రంలో సంపన్నులంతా మరింత సంపన్నులైపోతున్నారని పేదవాళ్లు బ్రతుకుదెరువు లేక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని అన్నారు.దేశంలో 140 కోట్ల మంది జనం ప్రభుత్వాలకు చెల్లించాల్సిన పన్నులను నవా పైసా లేకుండా చెల్లిస్తున్నారని ధన సమృద్ధి కలిగిన రాజకీయ నేతలందరూ బ్యాంకుల రుణాలను ప్రభుత్వాలకు చెల్లించాల్సిన పన్నులను వేల కోట్ల రూపాయల్లో లక్షల కోట్ల రూపాయల్లో ఎగ్గొడుతున్నారని వాటి భారం అంతా పేద ప్రజలపై వేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆర్థిక దోపిడిని సంపన్నుల కట్టబెడుతూ ఆర్థిక భారాన్ని పేద ప్రజలపై వేస్తుందని దీనిబట్టి చూస్తే దేశం మొత్తంలో అవినీతి అనేది హద్దులు లేకుండా సాగుతుందని మండిపడ్డారు.రాజకీయ నాయకులైన వ్యాపారవేత్తలైన అక్రమాస్తులు సంపాదించడానికి పూర్తిస్థాయిలో సహకరిస్తున్నది మాత్రం దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వ్యవస్థలలోని అధికారులేనని వాళ్లంతా రాజకీయ నాయకులు చేస్తున్న అవినీతికి సహకరిస్తూ అవినీతిమయంలో మునిగితేలుతూ ఉద్యోగాల్లో కొనసాగుతున్నారని అలాంటి అధికారులను, ఉద్యోగులను మొదటగా గుర్తించి వాళ్ళ భరతం పడితే తప్ప దేశంలో అవినీతి దోపిడిని కట్టడి చేయలేమని స్పష్టం చేశారు.

## టీజీఈజేఏసీ మహాధర్నాలో కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల సంఘీభావం







**హన్మకొండ, 27 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో హన్మకొండ కలెక్టరేట్ వద్ద నిర్వహించిన మహాధర్నాలో కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ ఎన్‌జీవో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బూర నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి వల్లాల తిరుపతి మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగులకు పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు కరువు భత్యాలను విడుదల చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులను వెంటనే చెల్లించాలని, ఆరోగ్య కార్డుల సదుపాయాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టులను కూడా వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని అన్నారు. టీజీఈజేఏసీ పిలుపు మేరకు చేపడుతున్న ఉద్యమ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కాకతీయ యూనివర్సిటీ ఎన్‌జీవో ఉద్యోగుల సంఘం తరఫున పూర్తి సహకారం అందిస్తామని నాయకులు తెలిపారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం అన్ని ఉద్యోగ సంఘాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ మహాధర్నాలో ఎన్‌జీవో ఉద్యోగుల సంఘం నాయకులు తాటి దామోదర్, ఏతిరాజుల సతీష్ బాబు, తోట ప్రభాకర్, బి. కృష్ణవేణి పాల్గొన్నారు. అలాగే కాకతీయ యూనివర్సిటీ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు పి. గుమ్మయ్య, బొక్క మొగిలి, తిర్మల్ సింగ్, ఇలయ్య, వలి పాషా, మల్లికాంబ తదితరులు పాల్గొని టీజీఈజేఏసీ ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అన్ని ఉద్యోగ సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని, ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఒత్తిడి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## యశోదాలో గవర్నర్‌కు సిఎం పరామర్శ



**హైదరాబాద్,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

అనారోగ్యంతో హై టెక్ సిటీ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను సిఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలసి వెళ్లిన సిఎం గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసారు. ఈ మేరకు గవర్నర్ ఆరోగ్యంపై వైద్యులను ఆరా తీసారు.

## జివో 97ను రద్దు చేయాల్సిందే

**హరీష్ రావు డిమాండ్**

హనుమకొండ,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్): పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 97 జీవోను రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు దిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు. అంతకుముందు హనుమకొండలోని కలెక్టరేట్ వద్ద టీఎన్జీవోలు నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.

## ఖిలా వరంగల్ జూనియర్ కళాశాలలో సైన్స్ ప్రయోగశాలల నవీకరణ

**ఖిలా వరంగల్, 27 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఖిలా వరంగల్‌లో మూతబడిన సైన్స్ ప్రయోగశాలలను స్థానిక న్యాయవాది తీగల జీవన్ గౌడ్ తన తల్లిదండ్రులు కీర్తిశేషులు సుగుణమ్మ, వీరస్వామి గౌడ్‌ల జ్ఞాపకార్థం సుమారు రూ.65 వేల సొంత ఖర్చుతో నవీకరించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ అన్నారు. ప్రయోగశాలల నవీకరణ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ప్రయోగాత్మక జ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. తరగతి గదిలో నేర్చుకున్న శాస్త్రీయ అంశాలను ప్రయోగశాలలో స్వయంగా పరిశీలించి, ప్రయోగాలు చేయడం ద్వారా విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం, శాస్త్రీయ ఆలోచనా విధానం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. చాలాకాలంగా వినియోగంలో లేని ప్రయోగశాలలను పునరుద్ధరించి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దడం అభినందనీయమని పేర్కొన్నారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సుమారు రూ.65 వేల సొంత నిధులను వెచ్చించి విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే కార్యక్రమానికి సహకరించిన తీగల జీవన్ గౌడ్‌ను డాక్టర్ శ్రీధర్ సుమన్ అభినందించారు. ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, విద్యాభిమానులు, దాతలు తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినిస్తాయని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన రీతిలో ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రయోగశాలలు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను ప్రత్యక్షంగా ప్రయోగాల ద్వారా తెలుసుకునే అవకాశం కలిగిందని కళాశాల అధ్యాపకులు తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రయోగశాలలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పుష్పలత, పదవీ విరమణ పొందిన ప్రిన్సిపాల్ సత్యనారాయణ, బోధనా, బోధనేతర సిబ్బంది, స్థానిక కళాకారులు జీ.కే., పీ.కే., ఎన్.కే. బృందం సభ్యులు, స్థానికులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ నివారణ కేంద్రాన్ని సందర్శించిన ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

**హన్మకొండ, 27 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టీ. రోహిత్ నేత గురువారం కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ)లోని క్షయ నివారణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో క్షయ వ్యాధి నిర్ధారణ, పరీక్షలు, చికిత్సకు సంబంధించిన సేవలను పరిశీలించారు. క్షయ నివారణ కేంద్రం ఇన్‌చార్జి టీబీ నివారణ అధికారి డా. ప్రదీప్ రెడ్డి కేంద్రంలో నిర్వహిస్తున్న ట్రునాట్ ల్యాబ్, ఓపీ ద్వారా అందిస్తున్న రోగుల సేవలు, కల్చర్ ల్యాబ్ నిర్వహణ తదితర అంశాలను రోహిత్ నేతకు వివరించారు. క్షయ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలు, అనుమానితులను గుర్తించే విధానం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నిర్ధారణ అనంతరం అందిస్తున్న చికిత్సా విధానం గురించి కూడా వివరించారు. క్షయ వ్యాధి నియంత్రణకు క్షేత్రస్థాయిలో చేపడుతున్న చర్యలు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. క్షయ నిర్మూలనలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించడం, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని తొందరగా గుర్తించి పరీక్షలు నిర్వహించడం, నిర్ధారణ అయిన వారికి నిరంతర చికిత్స అందించడం వంటి చర్యల ప్రాధాన్యతను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో టిబీ స్టాఫ్, కల్చర్ ల్యాబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ఉద్యోగుల మహాధర్నాకు కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల మద్దతు







**పీఆర్‌సీ అమలు, ఆరు డీఏల విడుదల, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్**

**హనుమకొండ,27 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ వద్ద నిర్వహించిన మహాధర్నాలో కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బూర నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి వల్లాల తిరుపతి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీని అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని, ఉద్యోగులకు ఆరోగ్య కార్డుల సౌకర్యాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చేపడుతున్న ఉద్యమ కార్యక్రమాలకు కాకతీయ యూనివర్సిటీ ఎన్జీవో సంఘం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘం నాయకులు తాటి దామోదర్, ఏతిరాజుల సతీష్ బాబు, తోట ప్రభాకర్, బి. కృష్ణవేణి పాల్గొన్నారు. అదేవిధంగా కాకతీయ యూనివర్సిటీ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు పి. గుమ్మయ్య, బొక్క మొగిలి, తిర్మల్ సింగ్, ఇలయ్య, వలి పాషా, మల్లికాంబ తదితరులు పాల్గొని ఉద్యోగుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అన్ని ఉద్యోగ సంఘాలు ఐక్యంగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలి

**సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి**
**టీజీఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు**







**హనుమకొండ, 27 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ ప్రకటించి అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. తెలంగాణ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రాంతీయ సదస్సుకు దేవరకొండ సైదులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల టెట్ ఉత్తీర్ణత మార్కులను తగ్గించి, దీర్ఘకాలంగా కొనసాగుతున్న టెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. 317 జీవో కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**411 మంది వృత్తి విద్యా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి**

కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా వృత్తి విద్యా విభాగంలో క్రమబద్ధీకరణకు నోచుకోకుండా మిగిలిపోయిన 411 మంది ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సైదులు డిమాండ్ చేశారు. వారికి 22 సాధారణ సెలవులు మంజూరు చేయడంతో పాటు, వారి సేవా సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంతో ఉపయోగకరమైన పథకమని దేవరకొండ సైదులు తెలిపారు. ఈ పథకంపై వస్తున్న అపోహలు, అపవాదులను ఉద్యోగులు నమ్మవద్దని సూచించారు. ఆరోగ్య భద్రతకు సంబంధించిన పథకం అందించే ప్రయోజనాలను ప్రతి ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతీయ సదస్సులో భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు దిల్షాద్, ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గండు యాదగిరి, షేక్ మన్సూర్ అలీ, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మంగ నర్సింహులు, జనగామ జిల్లా అధ్యక్షుడు సునీల్ కుమార్, ములుగు జిల్లా అధ్యక్షుడు రవి, వృత్తి విద్యా కాంట్రాక్ట్ అధ్యాపకులు, టీజీఎస్‌టీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పాత్‌ఫైండర్ హై స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

ఐనవోలు పాత్‌ఫైండర్ హై స్కూల్‌లో రక్షాబంధన్ సందర్భంగా రాఖీ వేడుకలను విద్యార్థులు,ఉపాధ్యాయులు ఉత్సాహంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల రాఖీలను తయారు చేసి, సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం మరియు రక్షణకు ప్రతీకగా రాఖీలను కట్టుకున్నారు. రక్షాబంధన్ పండుగ యొక్క విశిష్టతను, భారతీయ సంస్కృతిలో కుటుంబ బంధాలకు ఉన్న ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు ఆనందోత్సాహాలతో కార్యక్రమంలో పాల్గొని, సోదరభావం, పరస్పర గౌరవం ఐక్యతను చాటుకున్నారు.ఈ వేడుకలు పాఠశాలలో ఆహ్లాదకరమైన సందేశాత్మక వాతావరణాన్ని నెలకొల్పాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డైరెక్టర్ డా. ఎల్.ఎన్. ఎన్. వెంకటేశ్వరరావు,ప్రిన్సిపాల్ ఎం.డి. సుభానొద్దీన్,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగిన వృద్ధురాలు మృతి

**హసన్‌పర్తి, ఆగస్టు 27, 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న 80 ఏళ్ల వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గంటురుపల్లి గ్రామానికి చెందిన పప్పు మహిపాల్ రెడ్డి (62), వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన తల్లి పప్పు సరోజన (80) కుటుంబానికి సమీపంలోని పాత ఇంట్లో నివాసం ఉంటున్నారు. సరోజన ప్రతిరోజూ ఉదయం 5 గంటలకల్లా నిద్రలేచేది. అయితే ఈ నెల 26న ఉదయం 6.30 గంటలైనా ఆమె బయటకు రాకపోవడంతో మహిపాల్ రెడ్డి తన భార్య లలితతో కలిసి ఇంటికి వెళ్లి చూడగా సరోజన కింద పడి కనిపించింది. ఆమెను నిద్రలేపి వివరాలు అడగగా, కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నానని, ఆ నొప్పిని తట్టుకోలేక పురుగుల మందు తాగినట్లు తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఆమెను వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 8.30 గంటల సమయంలో సరోజన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన తల్లి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని, అనారోగ్యం, తీవ్రమైన కడుపునొప్పిని తట్టుకోలేక ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు మహిపాల్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఘనంగా “ఖేలో ఇండియా సంవాద్”

**కులకచర్లలోని కరణం పద్మావతి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో కార్యక్రమం**
**వర్చువల్‌గా యువత, క్రీడాకారులతో సంభాషించిన ప్రధాని నరేంద్ర మోదీ**
**క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన జీవనశైలి**
**కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**
**“ఆరోగ్యకరమైన యువత - బలమైన భారత్” స్ఫూర్తితో నిర్వహణ**




**కుల్కచర్ల, ఆగస్టు 27 (జై భీమ్ న్యూస్) :**

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కులకచర్ల మండల కేంద్రంలోని కరణం పద్మావతి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో “ఖేలో ఇండియా సంవాద్ – ఖేల్ కీ బాత్, పీఎం కే సాత్” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ఉన్న యువత, క్రీడాకారులతో వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషించారు. క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన జీవనశైలి పెంపొందుతాయని, ప్రపంచ స్థాయిలో భారత్ క్రీడా శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉందని ప్రధాని వివరించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రమేష్ కుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు కరణం ప్రహ్లాద్ రావు, కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు శరత్ కుమార్ రెడ్డి, శంకర్ నాయక్, సీనియర్ నాయకుడు శ్రీ మాధవ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు, ఇతర నాయకులు, కళాశాల విద్యార్థులు, యువత పాల్గొన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ “ఆరోగ్యకరమైన యువత – బలమైన భారత్” అనే స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

# స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా పెంచాలి

**గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**





**హన్మకొండ, 27 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు జిల్లాలోని అనుమానాస్పద ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా పెంచాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తూ, చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడు నెలల కాలంలో జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో నిర్వహించిన తనిఖీల వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్యను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తనిఖీలకు సంబంధించిన నివేదికలను పరిశీలించడంతో పాటు స్కానింగ్ సెంటర్ల అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అవసరమైన చోట ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతి పొందిన వైద్యులు కాకుండా ఇతరులు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు సంబంధించిన సమాచారాన్ని అధికారులకు అందించే వారికి రూ.50 వేల పారితోషికం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టడంలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, మాతా శిశు సంక్షేమం ప్రోగ్రాం అధికారి డాక్టర్ రజిత, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఒంటేరు రమేష్, బన్ను ఎన్‌జీవోకు చెందిన నీతా, డెమో వి. అశోక్‌రెడ్డి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ రాజు

### ఆటో డ్రైవర్‌ను అభినందించిన ఎస్ఐ అభినవ్



**కాజీపేట, 27 ఆగస్టు 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ మైడిమర్రి రాజు తనకు దొరికిన మొబైల్ ఫోన్‌ను సొంతం చేసుకోకుండా పోలీసులకు అప్పగించి, యజమానికి తిరిగి చేరేలా చేశారు. గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతున్న సమయంలో ప్రయాణికురాలు ప్రశాంతికి చెందిన మొబైల్ ఫోన్ ప్రమాదవశాత్తు కిందపడిపోయింది. అదే సమయంలో మొబైల్‌ను గుర్తించిన ఆటో డ్రైవర్ రాజు దానిని తన వద్ద ఉంచుకోకుండా విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ సురేష్‌కు అప్పగించారు. అనంతరం మొబైల్ యజమానులు ఫోన్ చేయగా, మొబైల్ తన వద్ద సురక్షితంగా ఉందని, కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్‌కు వచ్చి తీసుకెళ్లాలని రాజు వారికి తెలిపారు. దీంతో యజమానులు పోలీస్ స్టేషన్‌కు చేరుకోగా, పోలీసులు మొబైల్‌కు సంబంధించిన వివరాలను, యజమాన్యాన్ని నిర్ధారించి ఫోన్‌ను వారికి సురక్షితంగా అప్పగించారు. దొరికిన మొబైల్‌ను నిజాయితీగా పోలీసులకు అప్పగించి యజమానికి తిరిగి చేరేలా చేసిన ఆటో డ్రైవర్ మైడిమర్రి రాజును జిఆర్పి కాజీపేట ఎస్ఐ అభినవ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అభినవ్ మాట్లాడుతూ రైలు ప్రయాణ సమయంలో ప్రయాణికులు మొబైల్ ఫోన్లు, నగదు, ఇతర విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దొరికిన విలువైన వస్తువులను తమ వద్ద ఉంచుకోకుండా సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు అప్పగించాలని కోరారు. ఆటో డ్రైవర్ రాజు చూపిన నిజాయితీ, బాధ్యతాయుత ప్రవర్తనకు పలువురు అభినందనలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి





**హన్మకొండ, 27 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ ఎం. చైతన్య కుమార్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులతో కలిసి జిల్లాలోని పలు డివిజన్లలో పర్యటించిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పరిస్థితిని సమీక్షించారు. కాజీపేట, ఫాతిమా నగర్, మచిలీ బజార్, సుధా నగర్, యాదవ నగర్ ప్రాంతాల్లో పర్యటించిన చీఫ్ ఇంజనీర్ నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి నిర్మాణ పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం హన్మకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల గృహ నిర్మాణ శాఖ అధికారులతో చీఫ్ ఇంజనీర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇంకా నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులను గుర్తించి, వారికి అవసరమైన అవగాహన కల్పించి నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఏఈలకు ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో ఎలాంటి జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని, లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని చైతన్య కుమార్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ నాయక్, డీఈలు రవీందర్, కిషన్ నాయక్, విష్ణువర్ధన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల ఏఈలు, సీఎల్టీసీలు, మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్‌కు ఘన సన్మానం






### అంతర్జాతీయ పరిశోధనా సహకారానికి అంగీకారం..
### ఫార్మసీ విద్యార్థులు, పరిశోధకుల్లో హర్షం

**కేయూ క్యాంపస్, 27 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

సౌదీ అరేబియాలోని జెడ్డాలో ఉన్న కింగ్ అబ్దులఅజీజ్ యూనివర్సిటీలో ఫార్మకాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్ కాకతీయ యూనివర్సిటీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌ను సందర్శించారు. ఆయనకు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జానపరెడ్డి కృష్ణవేణి, అధ్యాపక బృందం, విద్యార్థులు ఘనంగా సన్మానం చేశారు. ఇటీవల భారతదేశ పర్యటనకు వచ్చిన ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్‌ను ఆచార్య గాదె సమ్మయ్య ఆహ్వానం మేరకు కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలోని వివిధ విద్యా సౌకర్యాలు, పరిశోధనా ప్రయోగశాలలను పరిశీలించారు. కళాశాలలో ఉన్న పరిశోధనా మౌలిక సదుపాయాల నాణ్యతతో పాటు ప్రిన్సిపాల్ జానపరెడ్డి కృష్ణవేణి, ఆచార్య గాదె సమ్మయ్య, ఇతర అధ్యాపకులు చేపడుతున్న శాస్త్రీయ పరిశోధనలను ఆయన ప్రశంసించారు.

**విద్యార్థులకు అకాడమిక్ ఉపన్యాసం**

ఈ సందర్భంగా పీహెచ్‌డీ పరిశోధకులు, మాస్టర్స్ విద్యార్థులు, అధ్యాపకుల కోసం ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్ అకాడమిక్ ఉపన్యాసం నిర్వహించారు. వినూత్నమైన, కఠినమైన, ఉన్నత ప్రమాణాలతో కూడిన పరిశోధనలు చేపట్టి ఫార్మాస్యూటికల్, ఆరోగ్య శాస్త్రాల రంగాలకు విలువైన సేవలు అందించాలని విద్యార్థులు, యువ పరిశోధకులకు సూచించారు. కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలతో పరిశోధనా సహకారం ఏర్పాటు చేసేందుకు ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్ అంగీకరించారు. సౌదీ అరేబియాలోని కింగ్ అబ్దులఅజీజ్ యూనివర్సిటీ ద్వారా పరిశోధనకు సంబంధించిన వ్యయ సహకారంతో పాటు ప్రాజెక్టు సహాయకుడికి ఫెలోషిప్ అందించే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించి ఇరు సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు తన వంతు సహకారం అందిస్తానని వెల్లడించారు.

**25 ఏళ్ల పరిశోధనా అనుభవం**

ఆచార్య గాదె సమ్మయ్య మాట్లాడుతూ ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్‌కు 25 సంవత్సరాలకు పైగా బోధన, పరిశోధన, విద్యార్థుల పర్యవేక్షణ, అకాడమిక్ అభివృద్ధి రంగాల్లో అనుభవం ఉందన్నారు. ఫార్మకాలజీ పరిశోధన, ఫార్మాస్యూటికల్ విద్య, ఔషధ భద్రత, ఆధారపూర్వక చికిత్సా విధానాల అభివృద్ధిలో ఆయన విశేష సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్ ప్రస్తుతం కింగ్ అబ్దులఅజీజ్ యూనివర్సిటీలో ఫార్మకాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండటంతో పాటు, ఆ యూనివర్సిటీకి చెందిన డ్రగ్ రీసెర్చ్ అండ్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ పరిశోధనా కేంద్రంలోని ఔషధ భద్రత, ఫార్మాకోవిజిలెన్స్ విభాగంతో అనుబంధంగా ఉన్నారని తెలిపారు. ఆయన పరిశోధనా రంగాల్లో ఫార్మకాలజీ, ఫార్మాకోవిజిలెన్స్, ఔషధ భద్రత, హెర్బల్ మెడిసిన్, ఫైటోకెమిస్ట్రీ, సహజ ఉత్పత్తులు, ఆక్సిడేటివ్ స్ట్రెస్, మెటబాలిక్ డిజార్డర్స్, క్యాన్సర్ ఫార్మకాలజీ, న్యూరోఫార్మకాలజీ, కార్డియోవాస్క్యులర్ ఫార్మకాలజీ, మాలిక్యులర్ డాకింగ్, అధునాతన ఔషధ పంపిణీ వ్యవస్థలు ఉన్నాయని వివరించారు. సహజంగా లభించే జీవక్రియాశీల సమ్మేళనాల చికిత్సా సామర్థ్యాన్ని, వాటి చర్యా విధానాలను అధ్యయనం చేసేందుకు ప్రయోగాత్మక ఫార్మకాలజీతో పాటు కంప్యూటేషనల్ విధానాలను సమన్వయం చేస్తూ బహుళశాఖల పరిశోధనలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

**150కు పైగా పరిశోధనా వ్యాసాలు**

ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్ 150కు పైగా శాస్త్రీయ పరిశోధనా వ్యాసాలకు రచయితగా, సహ రచయితగా ఉన్నారని తెలిపారు. పలు పుస్తక అధ్యాయాలు, అకాడమిక్ పుస్తకాలను కూడా రచించారని పేర్కొన్నారు. ఆయన పరిశోధనా వ్యాసాల్లో అనేకం అంతర్జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయని, వాటిలో పలు పత్రికలు క్యూ1, క్యూ2 స్థాయికి చెందినవని వివరించారు. నైజెల్లా సటీవా, థైమోక్వినోన్, ఔషధ మొక్కలు, యాంటీఆక్సిడెంట్లు, వాపు సంబంధిత వ్యాధులు, మెటబాలిక్ డిజార్డర్స్, క్యాన్సర్, నానో ఆధారిత ఔషధ పంపిణీ వ్యవస్థలపై ఆయన చేసిన పరిశోధనలు విస్తృతంగా ఉదహరించబడ్డాయని తెలిపారు. ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్ పరిశోధనా ప్రభావానికి 8,177కు పైగా సైటేషన్లు, 35 హెచ్-ఇండెక్స్, 91 ఐ10-ఇండెక్స్ ఉన్నాయని, అంతర్జాతీయ స్థాయి శాస్త్రీయ సేవలకు గుర్తింపుగా స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ--ఎల్సేవియర్ రూపొందించిన ప్రపంచంలోని టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో ఆయన పలు సంవత్సరాల్లో స్థానం పొందారని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీతో పాటు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్‌ను కూడా ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్ సందర్శించి, అక్కడి ప్రముఖ ఆచార్యులు డాక్టర్ రమా, డాక్టర్ నందకిషోర్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్‌ను ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జానపరెడ్డి కృష్ణవేణి, అధ్యాపకులు నరసింహారెడ్డి, ప్రసాద్, సమ్మయ్య, నాగరాజు, స్వరూపరాణి, షాయదా, సునీత, ఉషాకిరణ్, ప్రియాంక, సుకన్య, సుజాత, సంగీత్, భాగ్య, శశిధర్ తదితరులు, విద్యార్థినీ విద్యార్థులు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ పరిశోధనా సహకారానికి మార్గం సుగమం కావడంపై అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




### పీఆర్సీ ప్రకటించాలి.. ఆరు డీఏలు విడుదల చేయాలి
### పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి
### పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలి
### సమస్యల పరిష్కారానికి త్వరలో శుభవార్త: నాయిని
### అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: హరీశ్‌రావు

**హనుమకొండ, 27 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్):**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన మహాధర్నాకు ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉద్యోగులు తమ కార్యాలయాల నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని మహాధర్నాలో పాల్గొన్నారు. మహాధర్నా శిబిరాన్ని సందర్శించిన స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి దృష్టికి ఉద్యోగుల సమస్యలు ఇప్పటికే వెళ్లాయని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. తన స్థాయిలో పరిష్కరించగలిగే సమస్యలను తప్పనిసరిగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని, అవసరమైతే ఉద్యోగులను ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఓపికగా ఉంటే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంబంధించి త్వరలోనే శుభవార్త వింటారని ఆశాభావం వ్యక్తం చేశారు. మహాధర్నాకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు వినయభాస్కర్, ధర్మారెడ్డి, రాజయ్య, సతీష్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడిచినా ఉద్యోగుల సమస్యల్లో ఒక్కటి కూడా పూర్తిగా పరిష్కారం కాలేదని విమర్శించారు.




ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని, మెరుగైన పీఆర్సీ ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ముఖ్యంగా పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. హెల్త్ కార్డుల సమస్య కూడా పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. జిల్లా జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పీఆర్సీ నివేదికను తెప్పించుకుని ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఎన్ఆర్‌జీఎస్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను కూడా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జేఏసీ కన్వీనర్ ఆకవరపు శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన వేల కోట్ల రూపాయల బకాయిలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తమకు రావాల్సిన హక్కుల కోసం కూడా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్టీయూ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న సమయంలో డీఏలు విడుదల కాకపోవడం ఉద్యోగుల కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం మోపుతోందన్నారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన కార్యాచరణ ప్రకారం ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాధర్నాను విజయవంతం చేశారని తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించి, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహాధర్నా అనంతరం జేఏసీ నేతలు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు ఉద్యోగుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు బైరీ సోమయ్య, పనికెల రాజేష్, డాక్టర్ ప్రవీణ్, రవీందర్ రాజు, పెండెం రాజు, కొమురయ్య, కట్కూరి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి, కామగోని రాంబాబు, వేమూరి రాంబాబు, కొడం రవి ప్రకాష్, విజయ్ కుమార్, సరస్వతి, వెంకట్రామిరెడ్డి, సర్వర్ హుస్సేన్, గోపాలరెడ్డి, ధర్మరాజు, భాస్కర్, కిరణ్ గౌడ్, రాజేష్, శ్యామ్ సుందర్, రాము నాయక్, పావని, గోపికృష్ణ, శ్రీజ్యోతి, జయంతి, సలీం, రాజమౌళి, రాజేష్ ఖన్నా, రాజీవ్, ప్రణయ్, పృథ్వి, శృతి తదితరులు పాల్గొన్నారు.

# మీరాలం చెరువుకు మహర్దశ





**పర్యాటక కేంద్రంగా అభివృద్ధి**
**ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం**
**పనులను పరిశీలించిన సిఎం రేవంత్**

**హైదరాబాద్,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్ నగరంలోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హంగులు అద్దబోతోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి అందాలు, జలక్రీడలు , వినోదాన్ని ఆస్వాదించేలా దీనిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం మిర్ ఆలం చెరువును అకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సుందరీకరణ పనులు , సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించిన సీఎం, పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 (50.18 శాతం) పైల్స్ పూర్తి కాగా, 62 పైల్ క్యాప్స్‌లో 28 (45.16 శాతం) పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. చెరువు పునరుజ్జీవనం, చెరువు పరిసర ప్రాంతాలు , ఐలాండ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా చెరువులోకి ఎలాంటి మురుగు నీరు చేరకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని, వర్షపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించి నీటి నాణ్యతను పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. యువతతో పాటు కుటుంబాలను ఆకట్టుకునేలా మిర్ ఆలం చెరువులో బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ కార్యకలాపాలను అందుబాటులోకి తేనున్నారు. పర్యావరణ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చెరువు చుట్టూ ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు , వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు కానున్నాయి. అంతేకాకుండా, చెరువులో ఉన్న ఐలాండ్లను ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలుగా, టెంట్లు వేసుకునే గ్లాంపింగ్ స్పాట్లుగా , డెస్టినేషన్ వెడ్డింగ్స్, ఈవెంట్లకు అనుకూలమైన వేదికలుగా రూపుదిద్దనున్నారు. ఈ నాణ్యమైన సౌకర్యాల కోసం పిపిపి విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి స్థానికులకు ఉపాధి కల్పిస్తారు. సమీపంలోనే ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని సమగ్రంగా అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. దీనివల్ల జూ పార్క్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ఒకే పర్యటనలో చెరువు అందాలు, జలక్రీడలు , కుటుంబ వినోదాన్ని పొందగలుగుతారు. విమానాశ్రయానికి సమీపంలో ఉండే ఈ చారిత్రక ప్రాంతం అభివృద్ధి చెందితే, హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులకు మిర్ ఆలం ట్యాంక్ ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా మారనుంది.

## రాఖీ పండుగ ప్రేమ, బాధ్యతలకు ప్రతీక: మంత్రి కొండా సురేఖ

**హైద్రాబాద్, 27 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



రాఖీ పండుగ కేవలం అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక మాత్రమే కాదని, ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, బాధ్యతలకు నిదర్శనంగా భారతీయ సంస్కృతిలో ఈ పండుగకు చారిత్రక ప్రాధాన్యత ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆగస్టు 28న రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ తాత్విక దృక్పథంలో అనుబంధం కేవలం రక్తసంబంధంతో మాత్రమే ఏర్పడదని, పరస్పర విశ్వాసం, బాధ్యతలతో బంధం మరింత బలపడుతుందని మంత్రి పేర్కొన్నారు. రక్తసంబంధం లేకపోయినా ఎంతోమంది సోదరసోదరీమణులు రాఖీ పండుగను తమ ఆప్యాయత, అనురాగాలకు ప్రతీకగా జరుపుకుంటారని తెలిపారు. సోదరి రాఖీ కట్టడం ద్వారా తన ప్రేమ, నమ్మకాన్ని వ్యక్తం చేస్తే, సోదరుడు ఆమెకు అండగా నిలవాలనే బాధ్యతను స్వీకరించే సంప్రదాయం ఈ పండుగలో అంతర్లీనంగా ఉందన్నారు. కష్టసుఖాల్లో పరస్పరం ఒకరికొకరు అండగా నిలవడం, తోడుగా ఉండటం అనే గొప్ప మానవీయ సందేశాన్ని రక్షాబంధన్ అందిస్తుందని కొండా సురేఖ అన్నారు. ప్రస్తుత సమాజంలో రాఖీ పండుగ అందించే సందేశాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మహిళల గౌరవం, సమానత్వం, స్వాభిమానాన్ని కాపాడుతూ వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడమే వారికి అందించే నిజమైన రక్షణ అని మంత్రి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళల భద్రత, అభివృద్ధి, సాధికారత కోసం బాధ్యతతో పనిచేస్తోందని తెలిపారు. ప్రతి సోదరుడు తన సోదరి గౌరవం, భద్రత, అభివృద్ధికి అండగా నిలవడంతో పాటు, ప్రతి కుటుంబం ఆడపిల్లల విద్య, స్వావలంబన, సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. రక్షాబంధన్ స్ఫూర్తి కుటుంబాలకే పరిమితం కాకుండా సమాజం మొత్తం విస్తరించాలని మంత్రి ఆకాంక్షించారు. పరస్పర గౌరవం, సహకారం, మానవత్వం మరింత పెంపొందితే సమాజం సురక్షితంగా, సమానత్వంతో ముందుకు సాగుతుందని కొండా సురేఖ పేర్కొన్నారు.

## అమరావతి ఛాంపియన్షిప్ కప్ విజేతలుగా ఏలూరు జిల్లా జట్టు

### మహిళల విభాగంలో ప్రథమ, పురుషుల విభాగంలో ద్వితీయం

**ఏలూరు, ఆగస్టు 27 (జై భీమ్ న్యూస్):**

ఈనెల 24 నుండి 27 వరకు తిరుపతిలో జరిగిన అమరావతి ఛాంపియన్షిప్ క్రీడా పోటీలలో ఏలూరు జిల్లా బాస్కెట్బాల్ అండర్ 23 మహిళల జట్టు ప్రథమ స్థానం దక్కించుకుంది. పురుషుల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా కోచ్‌లు కె. మురళీకృష్ణ. నాగరాజు మేనేజర్స్ శ్రీమతి లక్ష్మి. కుమారి బి.భవానీ దేవి మరియు క్రీడాకారులు క్రీడాకారిణులకు డిఎస్‌డిఓ అజీజ్. ఏలూరు జిల్లా బాస్కెట్బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ కార్యదర్శి గవ్వా శ్రీనివాసరావు, సభ్యులు అభినందనలు తెలియజేసారు.

## మంగళగిరిలో మోడల్ రైతు బజార్

**5.9 ఎకరాల్లో రూ.18 కోట్లతో ఏర్పాటు**

**గుంటూరు, ఆగస్టు 27 (జై భీమ్ న్యూస్):**

మంగళగిరిలో మోడల్ రైతు బజార్ నిర్మాణానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. అరబిందో ఫార్మా ట్రస్ట్ రూ. 18 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిడమర్రు రైల్వే గేట్ దగ్గర రైతు బజార్‌ను ఏర్పాటు చేస్తోంది. మొత్తం 5 ఎకరాల 90 సెంట్ల విస్తీర్ణంలో అత్యాధునిక హంగులతో రిటైల్, హోల్‌సేల్ కూరగాయలు, పండ్ల కోసం దీనిని ఏర్పాటు చేస్తున్నారు.ఈ మోడల్ రైతు బజార్‌లో 102 కూరగాయల స్టాళ్లు.. పండ్లు, పూల విక్రయాలకు 54 స్టాళ్లు.. ఇతర వస్తువుల కోసం మరో 60 షాపులు ఏర్పాటుకానున్నాయి.

## నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం


**కడియంపై వ్యాఖ్యలపై కౌశిక్ రెడ్డికి నోటీసులు**
**కౌశిక్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నంపై వేముల ఆగ్రహం**

**హైదరాబాద్,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలపై ఆగస్ట్ 29న అసెంబ్లీ కమిటీ హాల్1లో ఉదయం 11 గంటలకు ఎథిక్స్ కమిటీ భేటీ కానున్నది. కౌశిక్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై కమిటీ విచారించనున్నది. కాగా, 'ఎథిక్స్ కమిటీ పేరిట కాంగ్రెస్ సర్కార్ ప్రతిపక్షంపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బలిచేసేందుకు కుట్రలు చేస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నిండు శాసనసభలో బడివే, పండబెట్టి తొక్కుతా, బట్టలూడదీసి కొడుతా, మా దగ్గర కండలు తిరిగినోళ్లున్నరు.. బోర్ల వేసి కొడ్తం.. అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, 'అరేయ్ తోలుతీస్తా, బయట తిరుగనివ్వను' అని దానం నాగేందర్, 'పదికత్తులు లేస్తే మీ తలలు తెగుతయ్.. కత్తులతో కోలాటమాడుతా' అని మందుల సామేల్ బెదిరింపులు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ అసభ్య సైగలు ఎథిక్స్ కమిటీ కిందికి రావా? అని సూటిగా ప్రశ్నించారు. వారు మాట్లాడిన మాటలు, చేసిన చేష్టల వీడియోలు చూపుతూ ధ్వజమెత్తారు. కౌశిక్‌రెడ్డి ప్రవర్తనపై చర్చించి చర్యల సిఫార్సుకు ఈ నెల 29న ఎథిక్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటుచేసినట్టు నోటీసు వచ్చిందని, అయితే కౌశిక్ వ్యవహారాన్ని సిఫార్సు చేసిన సమయంలో ఎథిక్స్ కమిటీ మనుగడలో లేదని తెలిపారు. అసలు కమిటీ లేనప్పుడు ఆ వ్యవహారాన్ని ఎలా రెఫర్ చేస్తారని ప్రశ్నించారు. దీనిని బట్టి కక్ష సాధింపు చర్యగా అర్థమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కడియం శ్రీహరి అదే ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని కౌశిక్ ఆక్షేపించారని తెలిపారు.

## హన్మకొండలో బిఆర్ఎస్ ధర్నా

### హరీష్ రావు అరెస్ట్‌తో పోలీస్ స్టేషన్ ముందు బైఠాయింపు





**వరంగల్,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

బీఆర్ఎస్ ఎల్పీఉప నేత తన్నీరు హరీష్ రావును హనుమకొండ సుబేదారి లో పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళు తున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. అలాగే వరంగల్, హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

## ఇవి పథకం కింద ఆటో డ్రైవర్లకు సాయం

**200 కేటాయిస్తూ జివో జారీచేసిన తెలంగాణ**

**హైదరాబాద్,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆటోరిక్షా డ్రైవర్లకు ప్రయోజనం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్-2026'ను అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ పథకం అమలుకు సిఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్టిక్ర్ ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం ఏకంగా రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. ఈ పథకం ద్వారా సంప్రదాయ ఇంధన వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోల వినియోగం పెరగనుంది. పెట్రోల్, డీజిల్ కోసం రోజూ అయ్యే ఖర్చుతో పోలిస్తే ఎలక్టిక్ర్ వాహనాల నిర్వహణ వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో ఆటో డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరనుంది. రూ.200 కోట్ల నిధులతో 18,766 ఆటోలను ఇవిలుగా మార్చే పక్రియను ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## ఎఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

**అధిష్టానం తీసుకునే నిర్ణయం అందరికీ శిరోధార్యం**
**కాంగ్రెస్‌లో వ్యక్తిగత కోపాలకు తావు లేదన్న మహేశ్ గౌడ్**

**నిజామాబాద్,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందని, అయితే అది క్రమశిక్షణకు లోబడి ఉండాలన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే స్వేచ్ఛ ఎక్కువన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. ఇకపోతే తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు సర్ నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## మేమంతా క్షేమంగా ఉన్నాం: సతీష్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్): భారీ వరదలతో నేపాల్ పరిసర ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. ఈ వరదల వల్ల వంద మందికిపైగా మరణించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక వందలాది మంది గల్లంతయ్యారు. వారిలో విదేశీయులు కూడా ఉన్నారు. ఆ జాబితాలో భారతీయులు కూడా ఉన్నట్లు వార్తా కథనాలు వెలువడుతున్నాయి. దీంతో భారత్‌లోని వారి కుటుంబ సభ్యులు తీవ్ర కలత చెందుతున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటికే రంగంలోకి దిగి వారి ఆచూకీ కోసం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో టిబెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి స్పందించారు. ఆయన తాము క్షేమంగా ఉన్నామని, తాము వరదల్లో చిక్కుకోలేదన్నారు. తాము ఉన్న ప్రాంతంలో వరదల ప్రభావం లేదని తెలిపారు. తామంతా క్షేమంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఆగస్టు 30వ తేదీన హైదరాబాద్ చేరుకుంటామని సతీష్ రెడ్డి చెప్పారు.

# ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్ నుంచి నీటి అక్రమ విక్రయాలా?





**పేద ప్రాంతాలకు అందాల్సిన నీరు అపార్ట్‌మెంట్లకు తరలింపు**

**అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు**

**వరంగల్, 27 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

నగరంలోని దేశాయిపేట రోడ్డులో ఉన్న ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్ నుంచి నీటి కొరత ఉన్న ప్రాంతాలకు సరఫరా చేయాల్సిన తాగునీటిని కొంతమంది వాటర్ ట్యాంకర్ డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి రావాల్సిన డీడీ (డిమాండ్ డ్రాఫ్ట్) చెల్లింపులు లేకుండానే నీటిని ట్యాంకర్లలో నింపుకుని ప్రైవేట్ అపార్ట్‌మెంట్లకు విక్రయిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సికెయం కాలేజీ నుంచి మార్కెట్ వైపు వెళ్లే మార్గంలో కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లకు ప్రతిరోజూ కొన్ని వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అపార్ట్‌మెంట్ నిర్మాణం ప్రారంభ దశ నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు కొందరు ట్యాంకర్ డ్రైవర్లు సంబంధిత వ్యక్తులతో మాట్లాడుకుని నీటి సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్ నీటిని సుమారు రూ.1,000 వరకు విక్రయిస్తున్నట్లు స్థానికుల నుంచి సమాచారం అందుతోంది.

**పేద ప్రాంతాలకు నీటి సరఫరా ఏదీ?**

నగరంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా పేదలు నివసించే స్లమ్ ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో, అదే ప్రభుత్వ ఫిల్టర్ బెడ్ నుంచి నీటిని ప్రైవేట్ అపార్ట్‌మెంట్లకు తరలించి విక్రయించడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల అవసరాల కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ నీటిని ప్రైవేట్ నిర్మాణ సంస్థలకు విక్రయిస్తే,నీటి కొరత ఎదుర్కొంటున్న పేద ప్రజల పరిస్థితి ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల వివరణపై స్పష్టత కరవు**

ఈ ఆరోపణలపై ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్ డీఈని వివరణ కోరగా ఆయన అందుబాటులో లేరని, ఏఈ వివరణ ఇస్తారని సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశానికి సంబంధించి ఫొటోలు, సందేశాలు పంపడంతో పాటు ఫోన్ ద్వారా సంప్రదించినప్పటికీ సంబంధిత అధికారి నుంచి స్పష్టమైన స్పందన రాలేదని సమాచారం. దీంతో నీటి తరలింపు వ్యవహారం ఎవరి ప్రోత్సాహంతో జరుగుతోంది? అధికారుల పర్యవేక్షణ ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**వర్షాకాలంలోనే ఇలా ఉంటే.. వేసవిలో పరిస్థితి ఏంటి?**

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నీటి కొరత కొంత తగ్గిన పరిస్థితిలోనే రోజూ ట్యాంకర్ల ద్వారా నీటిని ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తుండటం తీవ్ర చర్చకు దారితీస్తోంది. వేసవిలో నీటి డిమాండ్ మరింత పెరిగిన సమయంలో ఒక్కో డ్రైవర్ రోజుకు ఐదు నుంచి పది ట్యాంకర్ల వరకు నీటిని ప్రైవేట్‌గా విక్రయించే అవకాశం ఉందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

**వాటర్ ట్యాంకర్ల నిర్వహణపైనా ప్రశ్నలు**

మరోవైపు వాటర్ ట్యాంకర్లకు అవసరమైన డ్రైవర్లు లేరని చెబుతున్నప్పటికీ, చెత్త తరలింపు, శానిటేషన్ విభాగాల్లో పనిచేసే డ్రైవర్లను వాటర్ ట్యాంకర్ల నిర్వహణకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు మున్సిపల్ కార్మికుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై కూడా అధికారులు సమగ్రంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

**క్షేత్రస్థాయిలో విచారణకు డిమాండ్**

ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్ నుంచి ప్రతిరోజూ ఎన్ని ట్యాంకర్లకు నీరు నింపుతున్నారు? వాటికి అధికారిక అనుమతులు ఉన్నాయా? డీడీ చెల్లింపులు జరుగుతున్నాయా? నీటిని ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరి అనుమతితో ప్రైవేట్ అపార్ట్‌మెంట్లకు సరఫరా చేస్తున్నారు? ఒక్కో ట్యాంకర్‌కు ఎంత వసూలు చేస్తున్నారు? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడేలా, ప్రజలకు అందాల్సిన నీటిని అక్రమంగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే నీటి సరఫరా వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేసి, పేదలు నీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తూ నీటిని సరఫరా చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద





**వరంగల్, 27 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

జిల్లాలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ డా. సత్య శారద గురువారం పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించిన కలెక్టర్ భవన నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్ సదుపాయాలు తదితర పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో, ఇంకా చేపట్టాల్సిన పనులు ఏమిటో అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ఆసుపత్రిని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్ తదితర సదుపాయాలను కూడా సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే వరంగల్ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక, మెరుగైన వైద్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పరిశీలన, సమీక్ష కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ రాంకుమార్ రెడ్డి, ఆర్ఎంవో అశ్విన్, ఆర్అండ్‌బీ ఈఈ రాజేందర్, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ ఆనందం, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

## రెండోదశ భూసమీకరణ రైతులకు రుణమాఫీ

**మంగళగిరికి కూడా అమరావతి నుంచే నీరు**

**సిఆర్‌డిఏ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి నారాయణ**

**అమరావతి,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

మంగళగిరికి రాజధాని అమరావతి నుంచి తాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 65వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న వివిధ పరిపాలన అనుమతులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. ఆ వివరాలను మంత్రి నారాయణ వివరించారు. 06.01.2026 ముందు వరకూ లోన్లు తీసుకున్న రెండో దశ భూసమీకరణ రైతులకు కూడా రుణ మాఫీ వర్తింప చేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకారం తెలిపారని మంత్రి నారాయణ వివరించారు. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్‌కు ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి చెప్పారు. మొత్తం రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసినట్లు తెలిపారు. ఎల్‌పీఎస్ రోడ్లను సీసీకి బదులు బీటీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 29 గ్రామాల లే ఔట్ రోడ్లు బీటీగా మార్చేందుకు అనుమతులు ఇచ్చినట్లు ఆయన వివరించారు. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు కూడా అంగీకారం తెలిపామని అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఐవోసీఎల్ గ్రీన్ ఎనర్జీ అభివృద్ధికి ఆమోదం తెలిపినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ పరిపాలన అనుమతులకు ఆమోదం లభించింది. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం, రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## జిందాల్ వర్సిటీలో లెక్చర్‌కు కెటిఆర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు హర్యానాలోని ప్రముఖ ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ఆహ్వానం అందింది. విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషిం చడంతో పాటు వారిని ఉద్దేశించి 'డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్' ఇవ్వాలని యూనివర్సిటీ కేటీఆర్‌ను ఆహ్వానించింది. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సి. రాజ్ కుమార్ ఈ మేరకు కేటీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. కేటీఆర్ రాక, ఆయన ఆలోచనలు, ప్రసంగం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తి, ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు. కేటీఆర్‌కు అనుకూలమైన తేదీ, సమయాన్ని బట్టి సెప్టెంబర్, అక్టోబర్ 2026లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన భారత్‌లోనే తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమీని సందర్శించాలని కూడా కేటీఆర్‌ను ఆహ్వానించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లోనూ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ విశేష గుర్తింపు సాధించింది. గతంలో రాష్ట్రపతులు, ఉప రాష్ట్రపతులు, భారత ప్రధాన న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సహా పలువురు ప్రముఖులు జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేటీఆర్ ఈ ఆహ్వానాన్ని స్వీకరించి యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులతో తన ఆలోచనలను పంచుకుంటారని యూనివర్సిటీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# నగరపాలక సంస్థ ఎన్నికలు ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలి





**ఎన్నికల ప్రక్రియను మనస్సు పెట్టి పనిచేస్తే సత్ఫలితాలు**

**పొరపాట్లు, అలసత్వం వహిస్తే సస్పెన్షన్ తప్పనిసరి**

**సర్ ప్రగతిపై అధికార్లు, సూపర్వైజర్లు, బియల్వో లతో కలెక్టరు కె.వెట్రిసెల్వి సమీక్ష**

**ఏలూరు, ఆగస్టు 27 (జై భీమ్ న్యూస్):**

స్థానిక నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ఏలూరు అర్బన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సాఎఫ్ఐ) ప్రగతిపై నగర పాలకసంస్థ అధికారులు, సూపర్వైజర్లు, బియల్వో లతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అర్బన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సాఎఫ్ఐ)పై మ్యాపింగు, అనామలీస్, కరేక్షన్లు, ప్రగతిపై అర్బన్ లో 247 పోలింగు బూత్ లు వారీగా 247 బియల్వో లతో సమీక్షించారు. ఏలూరు అర్బన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సాఎఫ్ఐ) ప్రగతి చాలా పూర్ గా ఉందని జిల్లా కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. ఈరోజు హాజరుకాని సూపర్వైజర్లు, బిఎల్వోలకు షోకాజ్ నోటీసులు జారీ చెయ్యాలని, ఇదే పరిస్థితి పునరావతమైతే సస్పెండు చేస్తానని జిల్లా కలెక్టరు హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఎన్నికలు ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలని, ఎన్నికల ప్రక్రియను మనస్సు పెట్టి పనిచేస్తే మంచిఫలితాలు వస్తాయని అన్నారు. పొరపాట్లు, అలసత్వం వహిస్తే సస్పెండు అవుతారని, తీవ్రత బట్టి ఉద్యోగం కోల్పోయే పరిస్థితి ఉందని ప్రతి ఒక్కరూ గ్రహించాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని మరియు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని, అనర్హులుగా గుర్తించిన వారి వివరాలను పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించుకుని తాగు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ప్రతి ఒక్కరూ అత్యంత బాధ్యతతో, అప్రమత్తంగా, మనస్సు పెట్టి పనిచెయ్యాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎస్ఐఆర్, మాపింగు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, బిఎల్వోలకు సీనియరు సూపర్వైజర్లతో మరొకసారి శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా ఎస్ఐఆర్, ప్రోగ్రామ్, అనామలీస్ లోపాలు, వ్యత్యాసాలు, మరియు మాపింగు ప్రక్రియపై సూపర్వైజర్లు, బూత్ లెవెల్ అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలని అన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం ఎస్ఐఆర్ పనులను వేగవంతం చెయ్యాలని అన్నారు. అనామలీస్ గుర్తింపు, ఓటర్ల జాబితాలోని వ్యత్యాసాలు మరియు లోపాలు, మాపింగు పనులు, పోలింగు కేంద్రాలు మరియు ఓటర్ల మాపింగు ప్రక్రియను పారదర్శకంగా పూర్తిచెయ్యాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ ఎన్నికలు నేపథ్యంలో కమిషనర్లు తమ పరిధిలో అనుభవజ్ఞులైన, సమర్థులైన అధికారులను గుర్తించి ఎన్నికల విధులకు నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని అంశాల్లో శాఖలు మధ్య సమన్వయం ఉండాలని, రాష్ట్ర ఎన్నికలు సంఘానికి నిర్ణీత గడువులో అవసరమైన వివరాలతో అనుసరణ నివేదిక సమర్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనరు ఏ.భానుప్రతాప్, అడిషనల్ కమిషనరు డి.శ్రీనివాస రావు, అసిస్టెంటు సిటీ ప్లానరు బాబూరావు, తహశీల్దారు యస్.వి. రవీంద్రనాథ్, సూపర్వైజర్లు, బిఎల్వోలు, నగరపాలక సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించడం కుదరదు

**పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య బానిస కాదు**
**పెళ్లంటే పరస్పర గౌరవంతో బతికే బంధం**
**పనిమానిషిగా చూడాలనుకునే తీరు క్షమార్హం కాదు**
**కర్నాటక హైకోర్టు సంచలన వ్యాఖ్యలు**

**బెంగళూరు,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

వివాహ బంధంలో భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య ఇంటి పనులు చేయాలి, అత్తమామలను తప్పనిసరిగా చూసుకోవాలి, పుట్టింటికి వెళ్లాలంటే భర్త అనుమతి తీసుకోవాలనే నిబంధన ఏదీ లేదని పేర్కొంది. వివాహం అంటే పరస్పర గౌరవం, నమ్మకం, సమానత్వంతో కొనసాగాల్సిన బంధమని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ చిల్లకూరు సుమలత ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. బెంగళూరు రూరల్ జిల్లాకు చెందిన సతీష్ అనే వ్యక్తి తన భార్య, కుమార్తెకు కుటుంబ న్యాయస్థానం నెలకు రూ.9,000 చొప్పున భరణం చెల్లించాలని ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తన తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, తన అనుమతి తీసుకోకుండానే తరచూ పుట్టింటికి వెళ్తోందని అతడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ వాదనలపై కోర్టు తీవ్రంగా స్పందించింది. భర్త చేసిన ఆరోపణలను పరిశీలిస్తే భార్యను కుటుంబ సభ్యురాలిగా కాకుండా ఇంటి పనుల కోసం ఉంచుకున్న వ్యక్తిగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. భార్య తన తల్లిదండ్రులను కలవడానికి పుట్టింటికి వెళ్లాలంటే భర్త లేదా అత్తమామల అనుమతి తీసుకోవాలనే ఆలోచనను కోర్టు ప్రశ్నించింది. ఒక మహిళ తన తల్లిదండ్రులను కలవడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భార్య ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి అనే విషయాలను పూర్తిగా భర్త నియంత్రించడం సరైన పద్ధతి కాదని కోర్టు పేర్కొంది. ఇలాంటి ఆంక్షలు మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను దెబ్బతీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇంటి పనులన్నీ భార్యే చేయాలనే భావన సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ జీవితంలో భార్యాభర్తలు ఇద్దరూ బాధ్యతలను పరస్పరం పంచుకోవాలని పేర్కొంది. అలాగే వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా వారి సొంత పిల్లలపై ఉంటుందని కోర్టు తెలిపింది. అత్తమామలను చూసుకోవడాన్ని కోడలిపై తప్పనిసరి బాధ్యతగా మోపడం సమంజసం కాదని స్పష్టం చేసింది. కోడలు అత్తమామలకు సేవ చేయడం ఆమె ఇష్టంతో జరగాలి తప్ప, బలవంతం చేయడం సరికాదని పేర్కొంది. వివాహ బంధం కేవలం కొన్ని ఆచారాలు, సంప్రదాయాలతో ఏర్పడే సంబంధం కాదని కోర్టు పేర్కొంది. భార్యాభర్తల మధ్య ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, సహకారం ఉండాలని తెలిపింది. లింగం ఆధారంగా మహిళల స్వేచ్ఛను పరిమితం చేయడం రాజ్యాంగం అందించే సమానత్వ సూత్రాలకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. భార్య, కుమార్తెకు రోజుకు రూ.150 చొప్పున కూడా భరణం చెల్లించలేనని భర్త చేసిన అభ్యర్థనను కోర్టు కొట్టివేసింది.

## నేపాల్ వరదల్లో మాజీ ఎమ్మెల్యే భార్య గల్లంతు

**కోల్‌కతా,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే శుభ్రాన్షు రాయ్ భార్య శర్మిష్ఠ భౌమిక్ రాయ్ నేపాల్ వరదల్లో గల్లంతయ్యారు. శర్మిష్ఠ కోల్‌కతాకు చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా కైలాస మానససరోవర యాత్ర కోసం ఆగస్టు 21వ తేదీన నేపాల్ వెళ్లారు. ఆమె ఆగస్టు 25వ తేదీ మంగళవారం రాత్రి 11:30 గంటల సమయంలో శుభ్రాన్షు రాయ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తాను టిబెట్ సరిహద్దుకు సమీపంలోని 'కైరోంగ్' ప్రాంతంలో ఉన్నట్లు భర్తతో చెప్పారు. బుధవారం ఉదయం నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో భారీ ఎత్తున మెరుపు వరదలు వచ్చాయి. అప్పటినుంచి శర్మిష్ఠతో కమ్యూనికేషన్ పూర్తిగా తెగిపోయింది. తన భార్య పేరు మిస్సింగ్ లిస్ట్‌లో ఉందని శుభ్రాన్షు రాయ్ ధ్రువీకరించారు. కేవలం శర్మిష్ఠ మాత్రమే కాకుండా, ఆమెతో పాటు యాత్రకు వెళ్లిన కోల్‌కతాకు చెందిన 32 మంది యాత్రికుల బృందం ఆచూకీ లేకుండా పోయింది. వారి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు భారత రాయబార కార్యాలయాన్ని, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆశ్రయించారు.

## వనపర్తిలో రైస్‌మిల్లర్లపై బుల్‌డోజర్లు

**ప్రభుత్వానికి భారీగా ఎగవేసిన మిల్లులు కూల్చివేత**

**వనపర్తి,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

వనపర్తి జిల్లాలో సివిల్ సప్లై రంగానికి సంబంధించి నిబంధనలు ఉల్లంఘిస్తూ, ప్రభుత్వానికి కోట్లాది రూపాయల బకాయిలు పడిన రైస్ మిల్లులపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలకు దిగింది. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించి నిర్వహిస్తున్న చాముండి రైస్ మిల్ , సాంబశివ రైస్ మిల్లులను అధికారులు శనివారం కూల్చివేశారు. సివిల్ సప్లైస్ శాఖ, రెవెన్యూ విభాగం, ఇతర అధికారుల ఉమ్మడి ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించి బుల్డోజర్లతో మిల్లు నిర్మాణాలను నేలమట్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న మిల్లర్లకు ఈ చర్య ద్వారా అధికారులు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సివిల్ సప్లై బకాయిలను వసూలు చేసేందుకు అధికారులు ఎంత ప్రయత్నించినప్పటికీ రైస్ మిల్లుల యజమానులు ఏమాత్రం స్పందించలేదు. విచారణలో భాగంగా సాంబశివ రైస్ మిల్ ప్రభుత్వానికి రూ. 13 కోట్ల పైచిలుకు బకాయి పడగా, చాముండి రైస్ మిల్ ఏకంగా రూ. 39 కోట్ల మేర బకాయి పడినట్లు నిర్ధారణ అయ్యింది. మొత్తం రూ.52 కోట్లకు పైగా మొండిబకాయిలను చెల్లించకుండా తీవ్ర నిర్లక్ష్యం వహించడమే కాకుండా, కనీస అనుమతులు లేకుండా మిల్లులను నిర్వహించడంతో జిల్లా యంత్రాంగం చట్టపరమైన చర్యలను వేగవంతం చేసింది. రెవెన్యూ శాఖ సహకారంతో ఈ రెండు మిల్లులను పూర్తిగా కూల్చివేసి, బకాయిల రికవరీ దిశగా తదుపరి చర్యలు చేపట్టారు.

## తెలంగాణలో నడుస్తున్నది పోలీస్ పాలన

**పాలిటెక్నిక్ సమస్యలపై పోరాటం కొనసగుతుంది: బిజెపి**

**హైదరాబాద్,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నడుపుతున్నది ప్రజా పాలన కాదు, పోలీసుల నిర్బంధ పాలన అని స్పష్టమవుతోందని బిజెపి విమర్శించింది. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే వివాదాస్పద జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్, మాసాబ్‌ట్యాంక్, రామంతపూర్ నుంచి మొదలుకొని వనపర్తి, పరకాల దాకా విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా రోడ్డెక్కితే.. వారిపై లాఠీఛార్జీలు చేయించడం, అరెస్టులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల న్యాయమైన ఆందోళనకు మద్దతు తెలపడానికి వెళ్తున్న మా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తో పాటు పార్టీ ముఖ్య నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయించడం కాంగ్రెస్ పిరికితనానికి నిదర్శనం. చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పాలిత తెలంగాణలో విద్యార్థుల హక్కులను కాలరాస్తుంటే ఎందుకు కనిపించడం లేదన్నారు. పాలిటెక్నిక్ సాంకేతిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, విద్యార్థులకు ఉన్నత విద్య (ఈసెట్) అవకాశాలను దూరం చేసే కుట్రలను రేవంత్ రెడ్డి సర్కార్ తక్షణమే విరమించుకోవాలి. కంటితుడుపు కమిటీలతో కాలయాపన చేయకుండా వివాదాస్పద జీవో 97ను వెంటనే బేషరతుగా రద్దు చేయాలి. తెలంగాణ విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం భారతీయ జనతా పార్టీ అండగా నిలబడి చివరిదాకా రాజీలేని పోరాటం చేస్తుంది.

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

**మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి**
**ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు**
**ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ**
**తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్**

**న్యూఢిల్లీ,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

## జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు

**59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను తెరిచిన ప్రజలు**
**వివరాలను వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ**

**న్యూఢిల్లీ,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లకు చేరాయి. 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను ప్రజలు తెరిచారు. ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఇది బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పేర్కొన్నారు. మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, నగర ప్రాంతాల్లో ఉండగా.. అందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉండటం విశేషం. ఖాతాదారులకు ఇప్పటివరకూ 41.29 కోట్లకు పైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాతాల ద్వారా ఉచిత ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నారు. కనీస మొత్తం లేకుండానే రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్ ధన్-ఆధార్- మొబైల్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి. 2014 ఆగస్టు 28న ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది. జన్‌ధన్ ఖాతాలను కనీస నిల్వ లేకుండానే నిర్వహించుకోవచ్చు.. కానీ చెక్కు సౌకర్యం కావాలంటే మాత్రం ఖాతాలో కనీస బ్యాలన్స్ తప్పనిసరి నిబంధన విధించారు.

## మైనింగ్ ఎడి జయరాజు ఇళ్లపై ఎసిబి దాడులు

**భారీగా నగదు, నగలు స్వాధీనం**

**హైదరాబాద్,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

భాగ్యనగరంలో మరోసారి ఏసీబీ సోదాలు కలకలం రేపుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భ గనుల శాఖ ఏడీ జయరాజు ఇళ్లలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. గురువారం తెల్లవారుజాము నుంచే సోదాలు మొదలయ్యాయి. భూపాలపల్లితో పాటు హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు ప్రాంతాల్లోని 8 చోట్ల అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో దాడులు కొనసాగుతున్నాయి. సోదాల్లో జయరాజ్ ఇంట్లో లక్షన్నర నగదు, బంగారు ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్, ల్యాండ్ డాక్యుమెంట్లను గుర్తించి.. పరిశీలిస్తున్నారు. బ్యాంకులో రూ.60 లక్షల నగదు ఏసీబీ అధికారులు గుర్తించారు. అలాగే రెండు కార్లు, రెండు బైక్‌లు, జనగామలో ఐదు ఎకరాల భూమి ఏసీబీ అధికారుల తనిఖీల్లో బయటపడింది. సోదాలపై ఏబీసీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్ మాట్లాడుతూ.. భూగర్భ జల గనుల శాఖ ఏడీ జయరాజు నివాసంలో పాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఉదయం నుంచి జరుగుతున్న సోదాల్లో నలభై తులాల బంగారాన్ని గుర్తించామన్నారు. జయరాజ్ ఇంట్లో లక్షన్నర నగదుతో పాటు ఆయన బ్యాంకు ఖాతాలో నగదును కూడా గుర్తించామని చెప్పారు. జనగామలో జయరాజుకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని.. ఆయనపై ఏసీబీకి అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. హైదరాబాద్‌లోనే నాలుగు చోట్ల సోదాలు కొనసాగుతున్నాయని సాయి మనోహర్ తెలిపారు. తాండూరు, వరంగల్‌లోని జయరాజ్ సన్నిహితులు, బంధువుల ఇళ్లల్లో కూడా సోదాలు జరుగుతున్నాయని అన్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్‌తో పాటు రెండు కార్లు, రెండు బైక్‌లను కూడా గుర్తించామన్నారు. సాయంత్రం వరకు సోదాలు కొనసాగుతాయని.. సోదాల అనంతరం ఆయన అక్రమాస్తులపై క్లారిటీ వస్తుందని వెల్లడించారు. జయరాజ్ ఇటీవలే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. ములుగు, భూపాలపల్లి జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతు న్న కొందరితో జయరాజ్ కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు గతంలో అనేకసార్లు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో అక్రమంగా ఆస్తులు కూడబెట్టరా..? అనే కోణంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

## ఆనాడు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే ఈ దుస్థితి వచ్చేదా

**జగన్ దుర్నీతి వల్ల ప్రాజెక్టులు పూర్తి కాలేకుండా పోయాయి**
**గత వైఫల్యాలను కప్పిపుచ్చి మాట్లాడడం విడ్డూరంగా ఉంది**
**జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు**




**విశాఖపట్నం,ఆగస్ట్27(జై భీమ్ న్యూస్):**

ఈరోజు రాష్ట్రంలో వ్యవసాయం దెబ్బతినడానికి వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగనే కారణమని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఆ రోజు ప్రాజెక్టులు కొనసాగించి ఉంటే.. నేడు ఎల్ నినో వచ్చినా సరే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదన్నారు. గురువారం విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తు కంటే అతి పెద్ద విపత్తు గొడ్డలి పార్టీ అని అభివర్ణించారు. ఎల్ నినో కంటే పెద్ద విపత్తు వైఎస్ జగన్ అని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రాజెక్టులు గాడిలో పెట్టామని తెలిపారు. ముఖ్యమంత్రిగా పని చేసిన జగన్.. తన పాలనను గుర్తుపెట్టుకోకుండా మాట్లాడడం బాధగా ఉందన్నారు. ఎల్ నినో పట్ల రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. రైతుల పట్ల ప్రేమ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని వైసీపీ అధినేత జగన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. సభలో అన్నింటికీ సమాధానాలు చెబుతామని పేర్కొన్నారు. సెంబ్లీకి వస్తే ఐదేళ్లలో చేసిన అన్యాయాలను నిలబెట్టి.. చెబుతామంటూ జగన్‌కు స్పష్టం చేశారు. క్రిమినల్ ముసుగులో ఓ రాజకీయ పార్టీ పెట్టడం వల్ల ఇలా ఉన్నాడని.. లేకుంటే ఎక్కడ ఉండే వాడో కూడా తెలియదని జగన్‌ను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. రెడ్ బుక్ ఇంప్లిమెంట్ చేస్తే.. ఎవరైనా ఉంటారా? అని వైసీపీ అధినేతను సూటిగా ప్రశ్నించారు. తప్పు చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. మ వద్ద కక్ష సాధింపులు ఉండవని కుండబద్దలు కొట్టారు. వైసీపీ హయాంలో బలహీన వర్గాలపై దమనకాండకు దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. ఆయన మాయ మాటలు బీసీలు నమ్మరని అన్నారు. బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్‌ని తగ్గించింది జగన్మోహన్ రెడ్డి అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. టీడీపీలో బీసీలకు స్వేచ్ఛ ఉందని అన్నారు. కానీ వైసీపీలో బీసీలకు స్వేచ్ఛ ఉందా? అని వైఎస్ జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. ప్రస్తుతం తాము బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని చూస్తే.. దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ జగన్‌పై అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను భయపెట్టి, ఏకగ్రీవం చేసుకున్నారని విమర్శించారు. ఇప్పుడు ఏకగ్రీవాలు అయితే సీట్లు ఇవ్వనంటూ భయపెడుతున్నారని ఆరోపించారు. తిరిగి ఎన్నికలు సాఫీగా జరిగితే తామే గెలుస్తామని వైఎస్ జగన్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అచ్చెన్నాయుడు తెలిపారు. గొడ్డలి పార్టీ అధినేత ప్రతి పది రోజులకు ఓ సారి ప్రెస్ మీట్ పెట్టి అబద్ధాలను అలవోకగా చెప్పేస్తున్నాడంటూ మంత్రి అచ్చెన్నాయుడు వ్యంగ్యంగా అన్నారు. దీనిని ప్రతి ఒక్కరు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. అయినా దీనిని జగన్ ఆపడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. కూటమి పార్టీపై బురద చల్లడం జగన్‌కు అలవాటుగా మారిపోయిందని విమర్శించారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు చెప్పే అబద్ధాలను ఎవరైనా నమ్ముతారేమోనని.. ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకే తాము ముందుకు వస్తున్నామని అచ్చెన్నాయుడు వివరించారు.

# సినిమా విజయం చిత్ర పరిశ్రమలో అందరిది

### ఇరుడముడికి చిరంజీవి ప్రత్యేక అభినందనలు



ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది 'ఇరుముడి'. రవితేజ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాపై ఇప్పటికే పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా అగ్ర కథానాయకుడు చిరంజీవి ఈ హిట్ సినిమాపై రివ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పెట్టిన క్యాప్షన్ ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఒక సినిమా విజయం సాధిస్తే పరిశ్రమలో అందరికీ పండగే అని చెప్పిన చిరు.. 'ఈ పరిశ్రమ అందరిది.. ఏ కొందరిదో కాదు. మనం బతకాలి.. ఇతరులనూ బతికించాలి' అని పేర్కొన్నారు. ఇక 'ఇరుముడి' చిత్రబృందానికి చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన సోదరుడు రవితేజకు అభినందనలు. సినిమాను మొదటి నుంచి చివరి వరకు పూర్తిగా ఆస్వాదించా. రవితేజ అద్భుతంగా నటించాడు. ఈ సినిమా బాధ్యతను దర్శకుడు శివ నిర్వాణ తన భుజాలపై వేసుకుని గొప్పగా తీర్చిదిద్దారు. సున్నితమైన భావోద్వేగాన్ని ఆవిష్కరించిన తీరు బాగుంది. బాలనటి నక్షత్రకు గొప్ప భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నా. 'ఇరుముడి'లో భాగమైన నటీనటులకు, టెక్నీషియన్స్‌కు, నిర్మాతలకు ప్రత్యేక అభినందనలు' అని చిరు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ చిత్ర విజయం అర్హమైనదని పేర్కొన్నారు. చిరు పోస్ట్‌పై రవితేజ స్పందించారు. 'అన్నయ్యా థాంక్యూ..' అంటూ హార్ట్ ఎమోజీలను జోడించి కృతజ్ఞతలు చెప్పారు. విడుదలైన నాటి నుంచి థియేటర్స్ హౌస్ ఫుల్‌తో కళకళలాడుతుండగా, ఆరో రోజు కూడా అదే జోరు కొనసాగింది. కొన్ని థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న సినిమాను తీసేసి 'ఇరుముడి' వేయాలంటూ పలువురు ప్రేక్షకులు ఆందోళన చేస్తున్నారు. మరికొన్ని చోట్ల సీట్లు సరిపోక కుర్చీలు తెచ్చుకుంటున్నారు. కొన్ని హాళ్లలో ఏకంగా భజనలు చేస్తున్నారు. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

### ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన హీరో




అగ్రకథానాయకుడు అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 'షోస్టాపర్స్ 2026' ప్రత్యేక సంచిక కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితులు, సినిమాలో కథ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. బాలీవుడ్, దక్షిణాది సినిమా లేదా మరే ఇతర ప్రాంతీయ సినిమా అయినా సరే.. బాక్సాఫీస్ వద్ద ఆదరణ పొందాలంటే కథే ప్రధానం. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా హిట్ అవుతుంది. కొత్త కథను ప్రేక్షకులకు అందించడమే అన్నిటికంటే ముఖ్యం' అని అల్లు అర్జున్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సినిమాల్లోని నటీనటుల స్టార్‌డమ్ కంటే కూడా సరైన కథే చిత్ర విజయాన్ని నిర్ణయిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమాలు, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్.. ఇలా వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100 మంది తారల జాబితాను 'షోస్టాపర్స్' పేరుతో ఫోర్బ్స్ ఇండియా తాజాగా విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో ఇండస్ట్రీకి చెందిన పలువురు నటీనటులు చోటు దక్కించుకున్నారు. అల్లు అర్జున్‌తో పాటు అమితాబ్ బచ్చన్, మోహన్ లాల్, రజనీకాంత్, రామ్ చరణ్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, ఏఆర్ రెహమాన్, బాబీ దేవోల్, దుల్కర్ సల్మాన్, మాధవన్, రణ్‌వీర్ సింగ్, రిషబ్ శెట్టి, కల్యాణి ప్రియదర్శన్, కంగనా రనౌత్ ఇందులో ఉన్నారు.

# టాక్సిక్‌పై మిక్స్‌డ్ టాక్


### భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియా కూత




కేజీఎఫ్ స్టార్ యశ్ హీరోగా, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' కు రిలీజ్‌కు ముందు భారీ అంచనాలు నెలకొనడంతో అడ్వాన్స్ బుకింగ్స్‌లో అదిరిపోయే స్పందన లభించింది. అయితే సినిమా విడుదలైన తర్వాత మాత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ప్రీమియర్ షోల నుంచే సినిమాపై డివైడ్ టాక్ మొదలైంది. అడ్వాన్స్ బుకింగ్స్ కారణంగా తొలి రోజు భారీ ఓపెనింగ్స్ నమోదైనప్పటికీ, దీర్ఘకాలంలో సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు నిలబడుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో 'టాక్సిక్' తెలుగు థియేట్రికల్ హక్కులను దక్కించుకున్న ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజుకు భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. 'టాక్సిక్' సినిమాపై ప్రారంభం నుంచే భారీ బజ్ నెలకొంది. యశ్‌కు 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్, సినిమా భారీ స్థాయిలో రూపొందడం, పాన్ ఇండియా రిలీజ్ వంటి అంశాలు బిజినెస్‌పై ప్రభావం చూపాయి. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో దిల్ రాజు తెలుగు హక్కులను దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లోనూ సినిమాపై చిత్రబృందం చూపించిన విశ్వాసం భారీగా కనిపించింది. మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ మిశ్రా ఈ సినిమా రూ.2,000 కోట్ల వసూళ్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్ అని చెప్పినట్లు దిల్ రాజు ప్రస్తావించడం అప్పట్లో వైరల్ అయింది.ఆ నమ్మకంతోనే తెలుగు రాష్ట్రాల్లో 'టాక్సిక్'ను భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేశారు. కానీ విడుదలైన మొదటి రోజే టాక్ అంచనాలకు భిన్నంగా రావడంతో ఇప్పుడు బాక్సాఫీస్ రన్‌పై చర్చ సాగుతోంది. 'టాక్సిక్'కు డివైడ్ టాక్ రావడంతో కొందరు నెటిజన్లు దిల్ రాజు భారీగా నష్టపోతారంటూ పోస్టులు పెడుతున్నారు. రూ.100 కోట్ల వరకు నష్టం వస్తుందని కూడా సోషల్ మీడియాలో లెక్కలు వైరల్ అవుతున్నాయి.

# రణబాలి రిలీజ్ అక్టోబర్16కు మార్పు

రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. భారీ యాక్షన్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను సెప్టెంబర్ 11 ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాలతో విడుదలను వాయిదా వేశారు.తాజాగా 'రణబాలి' కొత్త రిలీజ్ డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. కొత్త రిలీజ్ డేట్ ప్రకారం దసరా సీజన్‌కు దగ్గరగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సెలవులు, భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరో సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌పై మేకర్స్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే తేదీకి సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తికరమైన బాక్సాఫీస్ క్లాష్‌కు తెరలేచింది. ఒకవైపు విజయ్ దేవరకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా, ఇతర భాషల్లోనూ మంచి మార్కెట్ ఉంది. మరోవైపు రజినీకాంత్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఉండటంతో ఈ రెండు సినిమాల పోటీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. 'రణబాలి'ని సాధారణ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కాకుండా భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. 19వ శతాబ్దం నేపథ్యంలో కథ సాగుతుంది. ముఖ్యంగా బ్రిటిష్ పాలన కొనసాగుతున్న సమయంలో 1854 నుంచి 1878 మధ్య జరిగిన చారిత్రక పరిణామాలను ఆధారంగా చేసుకుని ఈ కథను రూపొందిస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. విజయ్ దేవరకొండ ఈ సినిమాలో ఇంతకుముందెన్నడూ చూడని విధమైన పాత్రలో కనిపించనున్నారని టాక్. పీరియాడిక్ ప్రపంచం, భారీ యాక్షన్ సన్నివేశాలు, అప్పటి కాలానికి సంబంధించిన సెట్స్, విజువల్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది.




# మరోమారు సుక్కుతో రామ్‌చరణ్ జోడీ


### రంగస్థలంను మించి ఉంటుందంటూ ప్రచారం




టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ఈ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్ కథనం, రామ్ చరణ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ మరోసారి కలిస్తే బాక్సాఫీస్ వద్ద మరో భారీ సంచలనం నమోదవుతుందని అభిమానులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ కాంబినేషన్‌పై అభిమానులు ఎంతటి అంచనాలు పెట్టుకున్నా, వాటిని మించే స్థాయిలో సినిమా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. సినిమా టైటిల్, కథాంశం, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తాజా టాక్ ప్రకారం, ఈ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ ఈ ఏడాది నవంబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం రామ్ చరణ్, సుకుమార్ ఇద్దరూ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నేపథ్యంలో, ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ ఎలా ఉండబోతుందనేది కూడా ఆసక్తికరంగా మారింది.

# 4న వస్తున్న సహా

శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ ప్రధాన పాత్రధారులుగా నిశాంత్ దోటి తెరకెక్కించిన చిత్రం 'సహా (లైఫ్ ఆఫ్ సంజు)' తేజేశ్వర్ వేల్పుచర్ల నిర్మాత. వ్రజన పాండ్య, మహిపాల్, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ట్రైలర్ విడుదల చేసింది. 'సంజు అనే వ్యక్తి జీవితంలోని వివిధ దశల్ని చూపించే సినిమా ఇది. తన ప్రేమ, బ్రేకప్, మధుర జ్ఞాపకాలు, ఎదుర్కొన్న సవాళ్లు అన్నింటినీ దీంట్లో చూపించనున్నారు. ఇది ప్రతిఒక్కరి మనసుకు దగ్గరయ్యే ఓ భావోద్వేగభరిత ప్రయాణంలా ఉంటుంద'ని చిత్ర వర్గాలు తెలిపాయి.




# నుటడు నారాయణరావు కన్నుమూత




ప్రముఖ నటుడు జీవీ నారాయణ రావు (73) కన్నుమూశారు. ఆయన ఇకలేరనే విషాదకర వార్తను నటి కరాటే కల్యాణి సోషల్‌మీడియా వేదికగా వెల్లడించారు. నారాయణ రావు 100కు పైగా చిత్రాల్లో నటించారు. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'అంతులేని కథ' చిత్రంతో నటుడిగా పరిచయమైన ఆయన.. తొలి సినిమాకే ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. మద్రాస్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న నారాయణరావు.. రజనీకాంత్, చిరంజీవిలకు మంచి మిత్రుడే. 'అంతులేని కథ', 'ముత్యాల పల్లకి', 'అంగడి బొమ్మ', 'చిలకమ్మ చెప్పింది', 'గ్యాంగ్ లీడర్', హిట్లర్ వంటి సినిమాల్లో నటించారు. దేవాంతకుడు, ఇంటికో రుద్రమ్మ, యముడికి మొగుడు, పెళ్ళి నీకు శుభం నాకు సినిమాలను నిర్మించారు. నారాయణరావు మృతిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సంతాపం తెలిపింది. నారాయణరావుకు ఒక కుమారుడు, కుమార్తె. ప్రస్తుతం ఇద్దరూ విదేశాల్లో ఉంటున్నారు. కృష్ణాజిల్లా కురుమద్దాలి గ్రామంలో జన్మించిన నారాయణ రావు బాల్యం, విద్యాభ్యాసం గుంతకల్లులో సాగింది. గిడుగు విశాలాక్షి వద్ద భరతనాట్యం, నటరాజ రామకృష్ణ వద్ద కూచిపూడి నృత్యం, ఎ.ఆర్.కృష్ణ వద్ద నటన నేర్చుకున్నారు. చదువుకునే రోజులలో మహమ్మద్ బీన్ తుగ్లక్, ప్రతాపరుద్రీయం, మంచుతెర తదితర నాటకాలలో నటించారు. దివంగత సినిమా నటులు కోట శ్రీనివాసరావు, నూతన ప్రసాద్, దేవదాస్ కనకాల తదితరులు నారాయణరావుకు రంగస్థల మిత్రులు. సినిమాలతో పాటు పలు టి.వి.సీరియళ్లలోనూ నారాయణ రావు నటించారు.